

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (గురు) సా.6.23
సహరి (శుక్ర) ఉ.4.45

వెంకన్న హుండీల ఆదాయం
రూ.93.10 లక్షలు
- 7లో

దంచికొట్టింది!


కాకినాడ నగరంలో బుధవారం కురిసిన భారీ వర్షానికి జలమయమైన రహదారి

- ద్రోణి,ఉపరితల ఆవర్తనం ప్రభావంతో జిల్లావ్యాప్తంగా కుండపోత వర్షం
- దీనికితోడు ఈదురుగాలులు, భారీ శబ్దాలతో భయపెట్టిన పిడుగులు
- పెనుగాలుల తీవ్రతకు అనేకచోట్ల నేలకొరిగిన వృక్షాలు.. ట్రాఫిక్‌కు అంతరాయం
- కాకినాడ సిటీ, రూరల్‌లో పలుచోట్ల ఏకధాటిగా వడగండ్ల వాన
- ప్రత్తిపాడులో పిడుగుపడి ఓ యువకుడు మృతి.. మరో వ్యక్తికి గాయాలు
- సామర్లకోట, తాళ్లరేవు, పెద్దాపురంతోపాటు మెట్టలో రహదారులన్నీ జలదిగ్బంధం
- జిల్లావ్యాప్తంగా అనేక లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లల్లోకి వర్షం నీళ్లు
- ఈదురుగాలులు, చెట్లు నేలకొరగడంతో ఎక్కడికక్కడ విద్యుత్ అంతరాయం
- తాళ్లరేవు, జగ్గంపేటలో 5.4 సె.మీపైగా వర్షపాతం నమోదు

ద్రోణి, ఉపరితల ఆవర్తనం ప్రభావంతో జిల్లాలో బుధవారం కుండపోత వాన కురిసింది. ఉదయం నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా భారీగా వర్షం కురుస్తూనే ఉంది. ఉదయం చిరుజల్లులతో మొదలైన వాన మధ్యాహ్నానికి ఎక్కడికక్కడ మరింత పెరిగింది. దీని ప్రభావంతో రహదారులన్నీ పూర్తిగా జలమయమయ్యాయి. రాకపోకలకు వీల్లేనంతగా జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ముఖ్యంగా కాకినాడ నగరంలో వర్షం దంచికొట్టింది. ఎడతెరిపి లేకుండా అయిదు సెంటీమీటర్లకుపైగానే వాన పడింది. దీంతో ప్రధాన రహదారులన్నీ పూర్తిగా జలమయం అయ్యాయి. వాహనాలు సైతం ప్రయాణించే వీల్లేక జనం నానా ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షానికి ఈదురు గాలులు తోడవడంతో అనేకచోట్ల చెట్లు నేలకొరిగాయి. భారీ శబ్దాలతో ఉరుములు భయపెట్టాయి. కాకినాడ సిటీ, రూరల్‌లో ఏకంగా వడగండ్ల వాన కురిసింది. మరోపక్క ఈదురుగాలుల ప్రభావంతో అనేకచోట్ల చెట్లు నేలకొరగడం, విద్యుత్ వైర్లు తెడిపడడంతో సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ప్రత్తిపాడు మండలంలో పిడుగుపడి ఓ యువకుడు మృతిచెందగా, మరో వ్యక్తికి గాయాలయ్యాయి.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)


కరప మండలంలో పడిన వడగండ్లు

కొన్నిరోజులుగా వేసవి ఉష్ణోగ్రతలు జిల్లాలో భారీగా పెరిగాయి. మధ్యాహ్నం అయ్యేసరికి నడినెత్తిన సూరీడు సుర్రుమంటున్నాడు. ఈ తరుణంలో ఒక్కసారిగా వాతావరణం చల్లబడి భారీ కుండపోత వర్షం కురవడంతో కొంత ఊరటనిచ్చింది. అయితే కాకినాడ సిటీ, రూరల్‌లో మాత్రం ఇరవై నిమిషాల వ్యవధిలో అయిదు సెంటీమీటర్లకు మించి వర్షం కురవడంతో జనం తీవ్ర ఇబ్బందులుపడ్డారు. వాస్తవానికి విదర్భ నుంచి దక్షిణ తమిళనాడు వరకు ద్రోణి కొనసాగడం, కేరళ నుంచి ఉత్తర తెలంగాణ వరకు ఉపరితల ఆవర్తనం ఏర్పడ్డంతో దీని ప్రభావం వల్ల జిల్లాలో ఒకటి రెండు చోట్ల భారీ వర్షాలు నమోదవుతాయని వాతావరణశాఖ హెచ్చరించింది. కానీ ద్రోణి ప్రభావం అంతకుమించి జిల్లాపై బలంగానే ప్రభావం చూపింది. ఫలితంగా ఉదయం నుంచీ ఈదురుగాలులు, భారీ వర్షం కురవడంతో ఎక్కడికక్కడ రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కాకినాడ సిటీలో సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. దట్టమైన మేఘాలు అలుముకోవడంతో ఇరవై నిమిషాల వ్యవధిలో అయిదు సెంటీమీటర్లకు మించి కుండపోత వాన కురిసింది. దీంతో సినిమారోడ్డు, మెయిన్‌రోడ్డు, సామర్లకోట రోడ్డు, దేవాలయం రోడ్డు, సురేష్‌నగర్ ఏరియా, సర్పవరం, తూరంగి, కరప, కాకినాడ రూరల్ తదితర అనేక ప్రాంతాలు జల మయమయ్యాయి. అటు రహదారులన్నీ నీటమునిగిపోయాయి. ప్రయాణించడానికి కూడా వీల్లేని పరిస్థితి నెలకొంది. డ్రైనేజీలు సైతం పొంగిపొర్లి నీరంతా రోడ్లపైకి రావడంతో జనం నానా ఇబ్బందులుపడ్డారు. వర్షానికి తోడు భారీ ఈదురు గాలులు వీయడంతో అపార్ట్‌మెంట్లు, పక్కా ఇళ్లల్లోకి నీరు చేరిపోయింది. కలెక్టరేట్ సైతం జలమయమైంది. అటు కాకినాడ నగరంలోని జగన్నాథపురం, కాకినాడ రూరల్‌లోని పడగాల పేట, తూరంగి తదితర ప్రాంతాల్లో భారీ వడగండ్ల వాన కురవడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఏకధాటిగా పదినిమిషాలపాటు వడగళ్లు పడడం అందరిని కేరింతలు కొట్టేలా చేసింది. మరోపక్క వర్షానికి ఈదురు గాలులు తోడవడంతో కాకినాడ రూరల్‌లోని నడకుదురులో భారీ వృక్షం నేలకొరిగింది. దీంతో రెండున్నర గంటలపాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. జగన్నాథపురంలో భారీ వృక్షం నేలకొరగడంతో రెండు ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి. ప్రత్తిపాడు మండలం టి.రాయవరంలో పిడుగుపడి పతేటి మహేష్ (28) అనే పశువుల కాపరి మృతిచెందాడు. మరో వ్యక్తికి గాయాలయ్యాయి. సామర్లకోటలో అయితే సాయంత్రం ఏకబిగిన గంటపాటు వాన దంచికొట్టింది. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రైల్వేస్టేషన్‌లోకి నీరుచేరింది. వర్షం ప్రభావంతో పలు రైళ్లు ఆలస్యంకావడంతో ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు. జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి, ప్రత్తిపాడు, శంఖవరం, రౌతులపూడి, తాళ్లరేవు, పెదపూడి, పిఠాపురం తదితర మండలాల్లో భారీ వర్షాలకు రహదారులు నీటమునిగాయి. ఇళ్లల్లోకి నీళ్లు చేరాయి. ఈదురుగాలులు వీయడంతో చెట్లు కూలిపోయి విద్యుత్‌పోల్స్‌పై పడ్డాయి. ఫలితంగా రాత్రి దాటినా గ్రామీణ జిల్లాలో అనేక మండలాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ జరగలేదు. బుధవారం ఉదయం 8.30 గంటల నుంచి రాత్రి ఏడు వరకు నమోదైన వర్షపాతం పరిశీలిస్తే తాళ్లరేవు 5.4 సెంటీమీటర్లు, జగ్గంపేట 5.2, తొండంగి 4.7,పెదపూడి 4.5, గండేపల్లి 4, పెద్దాపురం 3.7, కిర్లంపూడి 3.5, తుని 2.6, కాకినాడ రూరల్ 2.3, ఏలేశ్వరం 2.3 చొప్పున నమోదైంది.


ఉప్పాడ తీరంలో అలల ఉధృతి

తీరంలో అలజడి!

- ఈదురుగాలులతో కూడిన వర్షం
- అకాల వర్షానికి రైతన్న ఆందోళన

కొత్తపల్లి, మార్చి 20:: ఉప్పాడ తీరంలో బుధవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంది. సాయంత్రం 4 గంటల నుంచి ఆకాశంలో దట్టమైన మబ్బులు ఆవరించాయి. ఇక తీరప్రాంతాల్లో ఈదురు గాలులు వీచాయి. ఉదయం సముద్రంలోకి వేటకు వెళ్లిన మత్స్యకారులు వాతావరణంలో ఏర్పడిన మార్పులను గమనించి వేట మధ్యలో ముగించుకొని ఒడ్డుకు చేరుకొన్నారు. అకాలంలో కురుస్తున్న వర్షానికి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొత్తపల్లి మండలంలో రైతాంగం దాళ్వా పంటకు పూర్తిస్థాయిలో పెట్టుబడులు పెట్టారు. పంట చేతికి వస్తుందన్న తరుణంలో వర్షాలు వస్తే పంటలు దెబ్బతింటాయని పలువురు రైతులు ఆందోళన చెందుతున్నారు.


కాకినాడ రూరల్ నడకుదురులో భారీ వృక్షం నేలకూలి ధ్వంసమైన బుల్లెట్ బైక్


కాకినాడ జగన్నాథపురం ప్రాంతంలో కూలిన వైసీపీ 'సిద్ధం' హోర్డింగ్

సముద్రంలో మూడు బోట్లు మునక

సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్న 12 మంది ఉప్పలంక మత్స్యకారులు - మెయిన్‌లో

కోడ్ వచ్చినా తీయలే..!

ఈదురు గాలులకు కూలినవైసీపీ 'సిద్ధం' హోర్డింగ్

కాకినాడ సిటీ, మార్చి 20 : కాకినాడ నగరంలో బుదవారం సాయంత్రం ఈదురుగాలులతో కురిసిన భారీ వర్షానికి జగన్నాథపురం ప్రాంతంలో ఓ భవనం రెండవ అంతస్థుపై గల వైసీపీ సిద్ధం హోర్డింగ్ కుప్పకూలింది. రద్దీ ప్రాంతం కావడంతో ఈ ఘటనతో వాహనాల రాకపోకలలో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినా ఈ ఎన్నికల ప్రచార హోర్డింగ్‌ను అధికారులు తీయించకుండా పట్టనట్లు వదిలేశారు. అయితే భారీ వర్షానికి తోడు ఈదులు గాలులకు ఒక్కసారిగా ఈ హోర్డింగ్ కూలిపోయిది.

కోడ్.. పట్టదా?

సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చి ఐదు రోజులు కావొస్తున్నా ఇంకా అధికార వైసీపీ ముద్రలు తొలగడం లేదు. కొందరు అధికారులు ఉదాశీనంగా వ్యవహరిస్తుండడంతో వైసీపీ గుర్తులు అడుగడుగునా కనిపిస్తున్నాయి. 20 గంటల్లోగా పూర్తిగా అధికార పార్టీ ప్రచార చిత్రాలను తొలగించాలని ఎన్నికల కమిషన్ ఆదేశించినా అమలు చేయడంలో అధికారులెందుకో నత్తనడకన చర్యలు చేపడుతున్నారు. బాధ్యులైన అధికారులపైనా చర్యలు చేపడితేగాని వైసీపీ ప్రచార దందాకు తెరపడదు.


ఎస్. పైడిపాలలో తొలగించని వైసీపీ ఫ్లెక్సీ

ఇప్పటికీ ఎక్కడి ఫ్లెక్సీలు అక్కడే

రౌతులపూడి, మార్చి20: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా మండలంలోని ఎస్.పైడిపాల, రౌతులపూడి గ్రామాల్లో నిబంధనలను అసలు పట్టించుకోవడం లేదు. ఎస్.పైడిపాల గ్రామంలో వైసీపీ ఫ్లెక్సీని తొలగించకుండా అలానే వదిలివేశారు. అలాగే ములగపూడి గ్రామంలో శిలాఫలకంపై జగన్ బొమ్మలు ఉన్నా ముసుగు వేయకుండా అలానే వదిలివేశారు.


రేషన్ వాహనంపై ఇప్పటివరకు తొలగించని సీఎం జగన్ చిత్రపటం

ఇది కోడ్ ఉల్లంఘన కాదా సార్..

ఏలేశ్వరం, మార్చి20 : రేషన్ పంపిణీ వాహనంపై తొలగించని సీఎం జగన్ చిత్రపటం ఇది. సార్వత్రిక ఎన్నికల నిబంధనలు అమలులో ఉన్నా అధికార యంత్రాంగం తమకు ఏం పట్టనట్టు వ్యవహరిస్తోంది. ప్రభుత్వ కార్యాలయాలు, పథకాలు అమల్లో వినియోగించే వాహనాలపైనా సీఎం చిత్రపటాలు తొలగించాలని ఎన్నికల కమిషన్ ఆదేశాలు ఇచ్చింది. పర్యవేక్షణ చేసే అధికారులు మాత్రం వాటిని పట్టించుకోవడంలేదు. ఏలేశ్వరం మండలం మర్రివీడు గ్రామశివారు పరిమతడకలో ఇంటింటికీ నిత్యావసర సరుకులు పంపిణీ చేసే వ్యాన్‌పై సీఎం జగన్, ఆయన తండ్రి రాజశేఖరరెడ్డి ఫొటోలు ఉండడంతో పలువురు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు.



తహశీల్దార్ ఆఫీస్ గోడకు జగన్ ఫొటో..

ప్రత్తిపాడు, మార్చి 20: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు తహశీల్దార్ కార్యాలయం గోడపై బుధవారం కూడా సీఎం జగన్ ప్రచార పోస్టర్ దర్శనమిచ్చింది. కోడ్ అమల్లోకి వచ్చి రోజులు గడుస్తున్నా పోస్టర్‌ను తొలగించకపోవడం ఏంటని అధికారుల దృష్టికి మీడియా తీసుకెళ్లడంతో వెంటనే ఈ పోస్టర్‌ను తొలగించి దానిపై న్యూస్‌పేపర్లు అంటించే కార్యక్రమం సిబ్బంది చేపట్టారు. నియోజకవర్గ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఆర్వో ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయం ఉన్న ఈ తహశీల్దార్ కార్యాలయం వద్ద ఈ సంఘటన చోటుచేసుకుంది.



నమో..నారసింహాయ..

- వైభవంగా కోరుకొండ లక్ష్మీనరసింహుని పరిణయం
- కన్నుల పండువగా రథోత్సవం
- పోటెత్తిన భక్తులు

- 7లో


పిఠాపురం పట్టణంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న కల్యాణం

కనులపండువగా వెంకన్న కల్యాణోత్సవం

పిఠాపురం, మార్చి20: తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహణలో పిఠాపురం పట్టణంలో ఉన్న పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవం బుధవారం రాత్రి కనులపండువగా జరిగింది. ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా వేదపండితుల మంత్రోశ్చరణల మధ్య స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని జరిపించారు. ముందుగా ధ్వజారోహణం జరిగింది. భక్తులు భారీగా తరలిరాగా, టీటీడీ డిప్యూటీ ఈవో పి.వెంకటయ్య, ఆలయ అధికారి సందీప్ తదితరులు పాల్గొన్నారు.


పిఠాపురం పాదగయ క్షేత్రంలో హుండీలను లెక్కిస్తున్న దృశ్యం

పాదగయకు రూ.24.56 లక్షల ఆదాయం

పిఠాపురం, మార్చి 20: పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రంలో హుండీలను బుధవారం లెక్కించారు. పాదగయలోని కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్ల సన్నిధిలో ఉన్న హుండీలను తెరిచి లెక్కించారు. 92 రోజులకుగానూ రూ.24.56 లక్షల ఆదాయం లభించింది. లెక్కింపులో పాదగయ ఈవో, సహాయ కమిషనరు పులి నారాయణమూర్తి, పెద్దాపురం మరిడమ్మ దేవస్థానం ఈవో సీహెచ్ రామ్మోహనరావు, సామర్లకోట కుమార భీమేశ్వరస్వామి దేవస్థానం ఈవో నీలకంఠం, దేవదాయశాఖ తనిఖీదారు వి.ఫణికుమార్, దేవస్థానం, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.


పోతులూరులో మాట్లాడుతున్న వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల (ఫైల్)

ఇదేంది సామీ..

- నోరుజారిన వైసీపీ అభ్యర్థి వరుపుల సుబ్బారావు
- టీడీపీ అభ్యర్థి అయిన నన్ను గెలిపించండి అంటూ తడబాటు
- పోతులూరు వైసీపీ సభలో ఘటన.. విస్తుబోయిన జనం

ప్రత్తిపాడు, మార్చి20: ప్రత్తిపాడు అసెంబ్లీ నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి వరుపుల సుబ్బారావు తన పార్టీ పేరు విషయంలో తడబడ్డారు. ప్రసంగ సమయంలో పొరపాటున వైసీపీ అనడం బదులు టీడీపీ అభ్యర్థి అయిన నన్ను గెలిపించండి అంటూ నోరుజారారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ సంఘటన ప్రత్తిపాడు మండలం పోతులూరు గ్రామంలో మంగళవారం సాయంత్రం జరిగింది. టీడీపీ కార్యకర్తలు కొందరు వైసీపీలో చేరిక సందర్భంగా ఆ గ్రామంలో వైసీపీ సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సమావేశానికి కాకినాడ వైసీపీ పార్లమెంట్ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, ఎమ్మెల్సీ అనంతఉదయభాస్కర్ తదితర నియోజకవర్గ నాయకులు విచ్చేశారు. సమావేశంలో స్థానిక వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు మాట్లాడుతూ మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌ను గెలిపించాలని కోరుతూ మరోవైపు తాను ఇన్‌చార్జి కాదని, నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిని అని, అది టీడీపీ తరుపున అంటూ చెప్పడంతో సమావేశంలో పాల్గొన్న పలువురు అవాక్కయ్యారు. వరుపుల తాను వైసీపీ అభ్యర్థి అనకుండా టీడీపీ తరుపున పోటీలో ఉన్నట్టు మాట్లాడిన వైనం సభికులను నివ్వెరపరిచింది.

జంట హత్యలు

- కాకినాడ జిల్లా చేబ్రోలులో కలకలం
- వివాహేతర సంబంధాల నేపథ్యంలో దారుణ ఘటన

లారీ ఢీకొనడంతో ఇద్దరు మహిళలు మృతి

- 7లో


టీడీపీ, జనసేన నాయకులతో పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ

ప్రజా సమస్యల పరిష్కారంలో గీత, దొరబాబు విఫలం

మాజీ ఎమ్మెల్యే వర్మ ధ్వజం

గొల్లప్రోలు, మార్చి 20: ప్రజాసమస్యలను పరిష్కరించడంలో ఎంపీ గీత, ఎమ్మెల్యే దొరబాబులు విఫలమయ్యారని మాజీ ఎమ్మెల్యే వర్మ విమర్శించారు. నియోజకవర్గంలో రైతులు అయిదు సంవత్సరాలుగా తీవ్ర సాగునీటి ఎద్దడి ఎదుర్కొన్నారని, ఈ సమయంలో రూ.600 కోట్లు విలువ చేసే పంటను కోల్పోయారని తెలిపారు. గొల్లప్రోలు పట్టణ శివారులో ఉన్న తన అతిథిగృహంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వర్మ మాట్లాడారు. టీడీపీ అధికారంలో ఉండగా రూ.1800 కోట్లతో పురుషోత్తపట్టణం ఎత్తిపోతల పథకాన్ని తీసుకొచ్చి రెండు పంటలకు పుష్కలంగా సాగునీరు అందించామని చెప్పారు. పథకానికి కరెంటు చార్జీలు చెల్లించకుండా నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. పిఠాపురం నియోజకవర్గంలో అభివృద్ధిపై ఎంపీ, ఎమ్మెల్యేలు తనతో చర్చకు రావాలని సవాల్ చేశారు. ఏలేరు ఆయకట్టులో సాగునీరు లేక పంటలు ఎండిపోతుంటే రిజర్వాయర్‌లో 3 టీఎంసీల నీటిని తాండవకు మళ్లించేందుకు ఎంపీ, ఎమ్మెల్యేలు అంగీకారం తెలిపి రైతుల పొట్టకొట్టారని మండిపడ్డారు. సమావేశంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పిఠాపురం నుంచి పవన్.. లేదంటే నేనే..

జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీలో లేకుంటే తెలుగుదేశం పార్టీ తరఫున తానే పోటీలో ఉంటానని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ ప్రకటించారు. ఇదే విషయాన్ని తెలుగుదేశం అధినేత చంద్రబాబు తనకు చెప్పారని తెలిపారు. మంగళవారం మంగళగిరిలో పవన్ మాట్లాడుతూ తనను ఎంపీగా పోటీ చేయాలని కేంద్ర పెద్దలు కోరారని, అయితే తనకు అసెంబ్లీకి పోటీ చేసి రాష్ట్రానికి సేవ చేయడానికే ఇష్టపడతానని చెప్పానని వ్యాఖ్యానించారని.. పవన్‌కల్యాణ్ పిఠాపురం నుంచి పోటీ చేస్తానని ప్రకటించినందున తన సీటును త్యాగం చేశానని వర్మ తెలిపారు. పవన్ ఇక్కడి నుంచే పోటీ చేయాలని కోరుకుంటున్నామని, ఆయనను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని తెలిపారు.

భరతం పడుతుంది - 7లో

'సి విజిల్ యాప్'

భరతం పడుతుంది

సార్వత్రిక ఎన్నికల (2024) షెడ్యూల్ విడుదల అయ్యింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) అమల్లోకి వచ్చేసింది. ఈ నేపథ్యంలో అక్రమాలకు, నిబంధనల ఉల్లంఘనలకు అవకాశం ఎక్కువగా ఉన్నాయి. ఎలాగైనా సరే గెలవాలనే ఆలోచనతో అధికారాన్ని అడ్డం పెట్టుకుని రెచ్చిపోవచ్చు. ఎన్నికల నిబంధనలను సైతం తుంగలో తొక్కేవాళ్లు లేకపోలేదు. ఏ రాష్ట్రంలో లేని విధంగా వలంటీర్ల వ్యవస్థ అధికార పార్టీ కనుసన్నల్లో పనిచేసేందుకు సిద్ధమవుతోంది. అవినీతి కార్యకలాపాలు కావచ్చు..నిబంధనల ఉల్లంఘన కావచ్చు.. శాంతిభద్రతల అంశం కావచ్చు..ఎక్కడ ఏం జరుగుతుందో తెలియదు. అది ఎలాంటి ఉపద్రవానికి దారి తీస్తుందో తెలియదు. అయితే వాటికి అడ్డుకట్ట వేయడానికి ఎలక్షన్ కమిషన్ ఓ దివ్యాస్త్రాన్ని తీసుకువచ్చింది. అదే 'సి విజిల్ యాప్'

● పెద్దాపురం/సామర్లకోట

ఎన్నికల వేళ పౌరుల చేతిలో దివ్యాస్త్రం సి విజిల్ యాప్

నిబంధనల ఉల్లంఘనలు, అక్రమాలపై స్పాట్‌లో ఫిర్యాదు చేసే సాంకేతిక పరిజ్ఞానం

అసలు ఏంటీ యాప్..

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిన నాటి నుంచి ఈ సి విజిల్ యాప్ అందుబాటులోకి వచ్చింది. ఎన్నికల ఉల్లంఘనలపై సాక్ష్యాలతో సహా అందులో పొందుపరచవచ్చు. ఫొటో లేదా వీడియో లేదా ఆడియో రూపంలో రికార్డ్ చేసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఫిర్యాదు చేసిన 5 నిమిషాల్లో ఎన్నికల అధికారులు రంగంలోకి దిగుతారు. దీనిపై విచారణ చేపట్టి 100 నిమిషాల్లో సదరు ఫిర్యాదుపై కచ్చితమైన చర్యలు తీసుకుంటారు. దీన్ని పౌరులు ఎవరైనా వినియోగించవచ్చు. పార్టీలకు అతీతంగా ఎవరు అవినీతికి పాల్పడినా ఈ యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చు.

5 నిమిషాల్లో

యాప్‌లో వివరాలు పొందుపరచగానే జిల్లా ఎన్నికల అధికారి 5 నిమిషాల్లో దానిని ఫీల్డ్ యూనిట్‌కు పంపిస్తారు. వారు 15 నిమిషాల్లో ఘటనా స్థలానికి చేరుకుంటారు. విచారించి 30 నిమిషాల్లో వివరాలు సేకరిస్తారు. అనంతరం ఎన్నికల అధికారికి నివేదిస్తారు. ఆయన దానిపై 50 నిమిషాల్లో చర్యలు తీసుకుంటారు. ఇలా 100 నిమిషాల్లో సి విజిల్ యాప్‌లో చేసిన ఫిర్యాదుపై చర్యలు తీసుకుంటారు. మీరు చేసిన ఫిర్యాదు స్టేటస్ కూడా తెలుసుకునే వెసులుబాటు ఉంది.



రిజిస్ట్రేషన్ ఇలా చేసుకోండి..

గూగుల్ ప్లే స్టోర్‌లో కేంద్ర ఎన్నికల సంఘం వారి సి విజిల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. మీఫోన్ నంబరు ద్వారా దానిలో రిజిస్టర్ చేసుకోవాలి. ఓటీపీ వస్తుంది. దాన్ని నమోదు చేస్తే సి విజిల్ యాప్ సిద్ధమైనట్టే.. దీని ద్వారా మీరు ఎన్నికల అక్రమాలపై ఫిర్యాదు చేయవచ్చు.

వీటిపై ఫిర్యాదు చేయవచ్చు..

డబ్బు పంపకాలు, ఉచితాలు, బహుమతులు అందజేత, రెచ్చగొట్టే ప్రకటనలు చేయడం, మద్యం, మత్తు పదార్థాల పంపిణీ, ఓటర్లను ప్రభావితం చేయడం, ఎన్నికల రోజు ఓటర్లను వాహనాల్లో తరలించడం, ఇలాంటి ఉల్లంఘనలను ఫొటో లేదా వీడియో లేదా ఆడియో రికార్డ్ చేసి అప్‌లోడ్ చేయండి.

PHOTO

VIDEO

AUDIO



ఫిర్యాదు చేసే విధానం

యాప్ ఓపెన్ చేయగానే తెరపై ఫొటో, వీడియో, ఆడియో అనే మూడు ఆప్షన్లు ఉంటాయి. ఫొటో ద్వారా ఫిర్యాదు చేయాలనుకుంటే ఫొటో ఆప్షన్ ఎంపిక చేసుకోవాలి. లోకేషన్ నమోదవుతుంది. ఉల్లంఘనకు సంబంధించిన ఫొటోను అప్‌లోడ్ చేయండి. ఏ రాష్ట్రం, ఏ నియోజకవర్గం అనే వివరాలను నమోదు చేయాలి. ఉల్లంఘనను క్లుప్తంగా వివరించాలి.





అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకే..

జె.సీతారామారావు, ఆర్డీవో ఎన్నికల రిటర్నింగ్ అధికారి

ఎన్నికల్లో ఎటువంటి అక్రమాలు జరగకుండా వాటికి అడ్డుకట్ట వేసేందుకు ఎన్నికల సంఘం సి విజిల్ యాప్‌ను రూపొందించింది. ఎన్నికల్లో అరాచకాలు, అక్రమాలకు పాల్పడే వారిని ఈ యాప్ ద్వారా పట్టించి వారికి చరమగీతం పాడొచ్చు. సి విజిల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని ఎక్కడైనా ఎన్నికల ఉల్లంఘనలు కనిపిస్తే ఫిర్యాదు చేయండి.

12 రకాల గుర్తింపు కార్డులు



అమలాపురం టౌన్/కలెక్టరేట్(కాకినాడ), మార్చి 20: ఓటు హక్కును వినియోగించుకునేందుకు 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి వినియోగించుకోవచ్చునని బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, కాకినాడ జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా తెలిపారు. ఓటరు గుర్తింపు కార్డులో అక్షర దోషాలు ఉన్నా ఆ ఓటరు నిజమైన ఓటరేనని నిర్ధారించుకున్న తర్వాత ఓటు వేయడానికి అనుమతి ఇస్తారన్నారు. ఓటరు గుర్తింపు కార్డులో ఫొటో తప్పుగా ఉంటే మాత్రం ఇతర 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి చూపి ఓటు వేయవచ్చునన్నారు. ఓటర్ల జాబితాలో నమోదైన ఓవర్‌సీస్ ఓటర్లు ఒరిజినల్ పాస్‌పోర్టును గుర్తింపుగా మాత్రమే చూపించి ఓటు వేయాల్సి ఉంటుందని, ఇతర గుర్తింపు కార్డులను అనుమతించబడవన్నారు. ఓటు హక్కు వినియోగానికి సూచించిన 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఆధార్‌కార్డు, ఉపాధిహామీ జాబ్‌కార్డు, బ్యాంకు, పోస్టాఫీసులు జారీచేసిన పాసు పుస్తకాలు, కార్మిక మంత్రిత్వశాఖ జారీ చేసిన హెల్త్ ఇన్సూరెన్సు స్మార్ట్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్సు, పాన్‌కార్డు, ఇండియన్ పాస్‌పోర్టు, ఫొటోతో ఉన్న పెన్షన్ డాక్యుమెంట్, కంపెనీలు జారీచేసిన ఉద్యోగ గుర్తింపుకార్డులు, సామాజిక న్యాయం, సాధికారిత మంత్రిత్వశాఖ జారీ చేసిన దివ్యాంగుల గుర్తింపు కార్డులో ఏదో ఒకటి చూపించి ఓటు హక్కును వినియోగించుకోవచ్చు.

జర్నలిస్టులకు పోస్టల్ బ్యాలెట్



కలెక్టరేట్(కాకినాడ),మార్చి 20: ఎన్నికల విధుల్లో ఉన్న జర్నలిస్టులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కు విని యోగించుకోవచ్చునని కాకినాడ జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. దీనికి అవసరమైన ఫారమ్ 12 (డి) దరఖాస్తును పొందాలన్నారు. అయితే అక్రిడిటేషన్ కార్డుతో పాటు ఎసెన్షియల్ సర్వీసెస్ షీట్‌ను నింపి ఈనెల 22వ తేదీ ఉదయం 11 గంటలలోపు 9494156640 నెంబర్‌కు వాట్సాప్ చేయాలన్నారు. ఇలా వాట్సాప్ చేసిన వారికి మాత్రమే పోస్టల్ బ్యాలెట్ అవకాశం ఉంటుందని కలెక్టర్ కృతికా శుక్లా చెప్పారు.

జంట హత్యలు

- కాకినాడ జిల్లా చేబ్రోలులో కలకలం
- వివాహేతర సంబంధాల నేపథ్యంలో దారుణ ఘటన


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

గొల్లప్రోలు రూరల్, మార్చి 20: తనతో సహజీవనం చేస్తున్న మహిళ మరొకరితో సన్నిహితంగా ఉండడాన్ని ఓ వ్యక్తి జీర్ణించుకోలేకపోయాడు. వారిని అంతమొందించి కక్ష తీర్చుకోవాలని నిర్ణయించుకున్నాడు. సహజీవనం చేస్తున్న మహిళను, ఆమెతో సన్నిహితంగా ఉంటున్న వ్యక్తిని కత్తితో పొడిచి చంపేశాడు. సదరు మహిళ తల్లిపై కూడా దాడి చేయడంతో ఆమె తీవ్రగాయాలతో చికిత్స పొందుతోంది.. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామంలో బుధవారం జరిగిన ఈ సంఘటన సంచలనం రేకెత్తించింది. చేబ్రోలు గ్రామానికి చెందిన పెండ్యాల లోవ(39) అనే మహిళ కొంతకాలంగా భర్తకు దూరంగా ఉంటున్నది. ఆమె అదే గ్రామానికి చెందిన లోకా నాగబాబుతో కొంతకాలంగా సహజీవనం చేస్తోంది. తనతో కాకుండా లోవ ఇదే గ్రామంలోని పోసిన శ్రీనివాస్(45)తో సన్నిహితంగా ఉంటుండడంతో వారి మధ్య సంవత్సరకాలంగా వివాదాలు జరుగుతున్నాయి. పలుమార్లు లోవను హెచ్చరించినా లెక్క చేయకపోవడంతో ఆగ్రహించిన నాగబాబు పలుమార్లు వారిపై దాడికి ప్రయత్నించాడు. బుధవారం ఉదయం చేబ్రోలు శివారులోని పెద్దింటమ్మతల్లి గుడి వద్ద అత్యంత సన్నిహితంగా వారిద్దరూ ఉండడాన్ని గుర్తించి నాగబాబు ఇద్దరిపై కత్తితో దాడి చేసి విచక్షణారహితంగా నరికి హత్య చేశాడు. అనంతరం లోవ, శ్రీనివాస్‌ల మధ్య సంబంధాన్ని ప్రోత్సహిస్తుందనే కోపంతో లోవ తల్లి విసరపు లక్ష్మీపై కత్తితో దాడి చేసి అక్కడ నుంచి పరారయ్యాడు. తీవ్రంగా గాయపడిన లక్ష్మిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. జంట హత్యలు చేబ్రోలు పరిసర గ్రామాల్లో కలకలం సృష్టించాయి. హత్యకు గురైన ఇద్దరు రక్తపుమడుగులో ఉండిపోయారు. సంఘటనా స్థలాన్ని జిల్లా అడిషనల్ ఎస్పీ భాస్కరరావు, కాకినాడ డీఎస్పీ హనుమంతరావు, ట్రైనీ డీఎస్పీ ప్రమోద్, పిఠాపురం సీఐ శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్‌ఐ బాలాజీ పరిశీలించారు. కాగా హత్యకు గురైన లోవకు ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమార్తెకు ఇటీవలే వివాహం జరిగింది. పోసిన శ్రీనివాస్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.


లోవ (ఫైల్‌ఫొటో)


పోసిన శ్రీనివాస్

లారీ ఢీకొనడంతో ఇద్దరు మహిళలు మృతి

లలితా ఇండస్ట్రీస్‌లో ఘటన



పెద్దాపురం, మార్చి 20: కాకినాడ జిల్లా పెద్దాపురం నుంచి వాలుతిమ్మాపురం వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న లలితా ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఇద్దరు మహిళా కార్మికులు లారీ ఢీకొని మృతి చెందారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పెద్దాపురం రాజీవ్ కాలనీకి చెందిన కామిశెట్టి కామేశ్వరి (51), పెద్దాపురం మండలం కట్టమూరు గ్రామానికి చెందిన మోటుపల్లి నాగరత్నం (65) ఇద్దరూ రైస్ మిల్లులో విధులకు రోజూలాగే హాజరయ్యారు. మధ్యాహ్నం భోజనాల అనంతరం మళ్లీ యథావిధిగా పనులు చేసుకుంటుండగా ఇంతలో వర్షం కురవడంతో పక్కనే ఉన్న గోడ వద్ద నిలబడ్డారు. ఇంతలో అక్కడే ఉన్న లారీని డ్రైవర్ బ్యాక్ చేస్తున్నాడు. గోడ వద్ద నిలబడి ఉన్న వారిని డ్రైవర్ గమనించకుండా వెనక నుంచి బలంగా ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన వారిని స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఇద్దరూ కూలీలు మృతిచెందారు. నాగరత్నానికి నలుగురు కుమారులు కాగా మిల్లులో పనిచేసుకోవడంతో పాటు పింఛన్ సొమ్ముతో జీవనం సాగిస్తోంది. కామేశ్వరి భర్త మృతిచెందగా రైసుమిల్లు ద్వారా వచ్చిన ఆదాయంతోనే జీవనం సాగిస్తోంది. ఇదిలా ఉండగా ఫ్యాక్టరీ యాజమాన్యం కూలీలు మృతిచెందిన విషయం బయటకు తెలియకుండా గోప్యంగా ఉంచేందుకు ప్రయత్నించింది. మృతదేహాలను స్థానిక ఆసుపత్రికి గుట్టచప్పుడు కాకుండా తరలించింది. వివరాలు నమోదు చేయకుండా మృతదేహాలను మార్చురీలో పెట్టి ఆసుపత్రి సిబ్బంది తాళాలు వేయడంతో పలు అనుమానాలు కలుగుతున్నాయి. ఈ విషయంపై ఎస్‌ఐ సురేష్ సం ఘటన స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. అలాగే కేసును దర్యాప్తు చేస్తున్నారు.

పూర్వ డీసీహెచ్ఎస్ రమేష్‌కిశోర్‌పై కొనసాగుతున్న విచారణ

కొవ్వూరు, మార్చి 20: గతంలో తూర్పుగోదావరి జిల్లా డీసీహెచ్ఎస్‌గా పనిచేసిన డాక్టర్ టి.రమేష్‌కిశోర్‌పై ప్రభుత్వానికి అందిన ఫిర్యాదుల నేపథ్యంలో బుధవారం కొవ్వూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో విచారణ చేపట్టారు. విచారణ అధికారి, విజయనగరం డీసీహెచ్ఎస్ డాక్టర్ బి.గౌరీ శంకరరావు ఫిర్యాదుదారులను, అప్పట్లో పనిచేసిన వైద్యులు, వైద్య సిబ్బందిని ఒక్కొక్కరిగా పిలిచి విచారించారు. డాక్టర్ బి.గౌరీశంకరరావు మాట్లాడుతూ అడ్వకేట్ వెల్ఫేర్ సొసైటీ న్యాయవాదులు గొట్టిముక్కల అనంతరావు, ధర్నాలకోట వెంకటేశ్వరరావులు గతంలో తూర్పుగోదావరి జిల్లా డీసీహెచ్ఎస్ డాక్టర్ టి.రమేష్‌కిషోర్‌పై ప్రభుత్వానికి, మెడికల్ అండ్ హెల్త్ విజిలెన్స్ అధికారులకు, జిల్లా కలెక్టర్ స్పందనలోను 2021 జూన్ 18వ తేదీన ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై ప్రభుత్వం విచారణకు ఆదేశించిందన్నారు. రమేష్‌కిషోర్ రాజమహేంద్రవరం ఆసుపత్రిలో ఎక్కువ కాలం పనిచేశారని, మహిళా ఉద్యోగులను వేధించడంతో వేధింపులు తాళలేక ఉద్యోగులు మెడికల్ లీవులు పెట్టారని, ఆరోగ్యశ్రీ డాక్టర్లకు ఇచ్చిన సొమ్మును సొంత అవసరాలకు వాడుకున్నారని, గ్లౌజులు పేషెంట్లతో కొనుగోలు చేయించారని, 8సంవత్సరాలుగా బదిలీ చేయకుండా ఎలా ఒకేచోట ఉంచారని వచ్చిన ఫిర్యాదులపై అప్పట్లో పనిచేసిన వైద్య సిబ్బందిని, ఫిర్యాదుదారులను, డాక్టర్లను విచారించారన్నారు. నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామన్నారు.

దాట్ల దేవదానంరాజుకు పురస్కారం


దేవదానంరాజును సత్కరిస్తున్న ప్రముఖులు

యానాం, మార్చి 20: కథకుడు, బహుగ్రంథకర్త దాట్ల దేవదానం రాజుకు సృజనాత్మక సాహిత్యం విభాగంలో పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారం ప్రదానం చేసింది. హైదరాబాద్‌లోని విశ్వవిద్యాలయం ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన పురస్కార సభలో తెలుగు విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ టి.కిషన్‌రావు, మెట్రోరైల్ ఎండీ ఎన్‌వీఎస్ రెడ్డి, రిజిస్ట్రార్ భట్టు రమేష్ పురస్కారాన్ని అందించారు. దాట్ల దేవదానంరాజుకు పురస్కారం లభించడంతో కళైమామణి విష్ణుమూర్తి, శిఖామణి, పీఆర్ఎల్ స్వామి, మధునాపంతుల సత్యనారాయణమూర్తి, ముమ్మిడి నాగప్రసాద్, చింతా కొండలరావు, జిమ్మి, రామ్మోహనరావు, డాక్టర్ శివప్రసాద్‌లు అభినందనలు తెలిపారు.

కల్యాణం..కమనీయం

కోరుకొండ లక్ష్మీనరసింహుని పరిణయం


కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

కోరుకొండ, మార్చి20: కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి శ్రీ భూసమేత అనంత పద్మనాభ స్వామి వార్ల దివ్య కల్యాణ మహోత్సవం బుధవారం రాత్రి 11గంటలకు అంగరంగ వైభవంగా జరిగింది. ఒకే రోజు ఒకే శుభ ముహుర్తంలో ఇటు లక్ష్మీనరసింహస్వామి వారికి, క్షేత్ర పాలకుడైన శ్రీ భూ సమేత అనంత పద్మనాభ స్వామి వారికి కల్యాణం నిర్వహించారు. రథోత్సవం అనంతరం బుధవారం రాత్రి స్వామివారిని, అమ్మవారిని రథం పై నుంచి ఎదుర్కోలుతో నూతన వస్త్రాలు, సుగంధ ద్రవ్యాలు సమర్పించి ఆలయానికి తీసుకుని వచ్చారు. అక్కడ స్వామివారికి, అమ్మవారికి మంగళస్నానాలు జరిపించారు. అనువంశిక ధర్మకర్తలు పరాసర లక్ష్మీనరసింహభట్టర్, పరాసర రంగరాజ భట్టర్ పర్యవేక్షణలో ఆగమ బ్రహ్మ పాణింగపల్లి పవన్‌కుమార్ ఆచార్యులు కల్యాణ క్రతువును శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామి వారి కల్యాణ మహోత్సవాలను పెద్దింటి రంగా ప్రసాద్ దంపతులు, పెద్దింటి చంటిబాబు దంపతులు పీటలపై కూర్చుని జరిపించారు. వీరితో పాటు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా దంపతులు, అన్నవరం దేవస్థానం జాయింట్ కమిషనర్ కె.రామచంద్రమోహన్ మరో 300 మంది యజమాన దంపతులు స్వామి వారి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. స్వామి వారి కల్యాణ మహోత్సవం సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం, అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం, రాజమహేంద్రవరానికి చెందిన ప్రముఖ వస్త్ర వ్యాపారి తుమ్మిడి బ్రదర్స్, కోరుకొండ గ్రామ పంచాయతీ వారు స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు అందజేశారు. స్వామి వారి కల్యాణ మహోత్సవాలు తిలకించేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు.

కనుల పండువగా రథోత్సవం

కోరుకొండ, మార్చి20: కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి దివ్యకల్యాణ మహోత్సవాల్లో భాగంగా బుధవారం మధ్యాహ్నం స్వామి వారి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. అంతకుముందు స్వామివారిని, అమ్మవారిని పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెగా అలంకరించి శాస్త్రోక్తంగా కార్యక్రమాలను నిర్వహించారు. ఆగమ బ్రహ్మ పాణింగపల్లి పవన్ కుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో అనువంశిక అర్చక స్వాములు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అన్నవరం దేవస్థానం అదనపు కమిషనర్ కె.రామచంద్రమోహన్ ఆధ్వర్యంలో ఎస్వీ రంగరాజభట్టర్, లక్ష్మీనరసింహస్వామి భట్టర్ సమక్షంలో రథానికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, రాజశ్రీ దంపతులు, బీజేపీ నాయకుడు నీరుకొండ వీరన్నచౌదరి, పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు గోవిందా అంటూ రథాన్ని ముందుకు లాగారు. భక్తుల భజనలు, గరగ నృత్యాలు, కోలాట నృత్యాలు, మంగళ వాయిద్యాలు, మేళతాళాలు, భక్తుల గోవింద నామస్మరణలతో రథోత్సవం ఘనంగా జరిగింది. వర్షం రాకతో రెండుసార్లు రథోత్సవానికి ఆటంకం కలిగింది. అనంతరం సాయంత్రం దిగ్విజయంగా ముందుకు సాగింది. వేలాది మంది భక్తులు అరటిపండ్లు స్వామి వారి రథంపై వేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు లేకుండా వర్షపు జల్లుల మధ్య స్వామి రథోత్సవం కన్నుల పండువగా సాగింది. పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.


రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

వెంకన్న హుండీల ఆదాయం రూ.93.10 లక్షలు



ఆత్రేయపురం, మార్చి 20: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలోని హుండీలను పర్యవేక్షణాధికారులు డి.నాగమల్లేశ్వరరావు, ఎం.రాధాకృష్ణ, బి.కిరణ్, బి.నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో బుధవారం లెక్కించారు. 28 రోజులకు ప్రధాన హుండీల ద్వారా రూ.71,44,868, అన్న ప్రసాద హుండీల ద్వారా రూ.21,65,525... మొత్తం రూ.93,10,393 ఆదాయం లభించింది. బంగారం 40 గ్రాములు, వెండి కిలో, వివిధ దేశాల కరెన్సీ లభి ంచింది. క్షేత్ర పాలకుడు అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి హుండీల ఆదాయం రూ.2,36,159 లభించినట్టు ఆలయ ఛైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఉప కమిషనర్, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు. లెక్కి ంపులో ధర్మకర్తల మండలి సభ్యులు, అర్చకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు పశువుల కాపరి మృతి

కాకినాడ జిల్లా వ్యాప్తంగా దంచికొట్టిన వర్షం


గండేపల్లి వద్ద హైవేపై వర్షపు నీరు


కాకినాడలో వడగండ్లు

ప్రత్తిపాడు, మార్చి 20: కాకినాడ జిల్లా వ్యాప్తంగా బుధవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రత్తిపాడు మండలం టి.రాయవరం గ్రామంలో బుధవారం సాయంత్రం పిడుగుపాటుకు గురై పశువుల కాపరి మృతి చెందగా మరొక యువకుడు గాయపడ్డాడు. రాయవరం గ్రామానికి చెందిన పద్దేటి మహేష్(28)నాలుగు గేదెలను మేపుకుంటూ రాయవరం సమీపంలోని వంతెన వద్ద పొలంలో ఉండగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. అదే క్రమంలో పిడుగు పడటంతో పొలంలో గొడుగుతో పశువులను కాస్తున్న మహేష్ అక్కడికక్కడే మృతి చెందాడు.ఈ సంఘటనకు సమీపంలో రహదారిపై ఉన్న కొండి సత్తిబాబు గాయపడ్డాడు. గ్రామంలో పద్దేటి కృష్ణ, సావిత్రి దంపతుల మూడో కుమారుడు మహేష్ ఆకస్మిక మరణంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. బాధిత కుటుంబాన్ని సర్పంచ్ తటవర్తి సుబ్బారావు, ఎంపీటీసీ రామన్న దొర పరామర్శించి సానుభూతి తెలిపారు. ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. సంఘటనాస్థలాన్ని వీఆర్వో ప్రసాద్ పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక


ఉపాధ్యాయులతో వెంకటదుర్గ

ఐ.పోలవరం, మార్చి 20: అనంతపురంలో జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం జి.వేమవరం హైస్కూల్ విద్యార్థిని బొమ్మిడి పూర్ణిమవెంకటదుర్గ ప్రతిభ కనబరిచి జాతీయ పోటీలకు ఎంపికైంది. ఈ నెల 26 నుంచి అహ్మదాబాద్‌లో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొంటుందని పీడీ జి.కళావతి తెలిపారు. వెంకటదుర్గను బుధవారం జరిగిన కార్యక్రమంలో అభినందించారు. దుర్గకు తర్ఫీదునిచ్చిన కళావతిని, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు జంపా హరికృష్ణ, ప్రధాన కార్యదర్శి అడ్డగళ్ళ నాగరామప్రసాద్‌ను సన్మానించారు. జడ్పీటీసీ ముదునూరి సతీష్‌రాజు, సర్పంచ్ నల్లా సుదర్శన్‌రావు, సొసైటీ అధ్యక్షుడు మెండా వెంకన్న, పీఎంసీ ఛైర్మన్ మద్దింశెట్టి వరలక్ష్మి పాల్గొన్నారు.

రేపు అరుణాచలానికి ప్రత్యేక బస్సు

కార్పొరేషన్ (కాకినాడ), మార్చి 20: కాకినాడ నుంచి అరుణాచలం యాత్ర కోసం ఈనెల 23న ఉదయం 11గంటలకు సూపర్ లగ్జరీ స్పెషల్ బస్సు బయలుదేరుతుందని డిపో మేనేజర్ తెలిపారు. ఈ బస్సు 3 రోజుల యాత్రలో ఐదు క్షేత్రాలు చూపించి తిరిగి 26న కాకినాడ వస్తుందన్నారు. యాత్రలో కాణిపాకం, శ్రీపురం, అరుణాచలం, కంచి చూపిస్తారని... ఈ యాత్రకు ఒక్కరికి రూ.3100 చొప్పున టిక్కెట్ వసూలు చేస్తారని తెలిపారు.

టీడీపీ, జనసేన, బీజేపీ కూటమితోనే సుభిక్షం

మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు


మాట్లాడుతున్న కొండబాబు

కాకినాడ సిటీ, మార్చి 20: తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అధికారంతోనే రాష్ట్రాభివృద్ధి సంక్షేమం సాకారమవుతుందని, ఈ కూటమి అధికారంలోకి వస్తేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం కొండబాబు అధ్యక్షతన టీడీపీ శ్రేణులతో కాకినాడ సిటీ నియోజకవర్గ ఎన్నికల సన్నద్ధత సమావేశం నిర్వహించారు. కొండబాబు మాట్లాడుతూ వైసీపీ విధ్వంసకర, అవినీతి, అరాచక, డ్రగ్స్, గంజాయి, రౌడీ, గూండాల పాలన నుంచి కాకినాడను మనం కాపాడుకోవాల్సిన ఆవశ్యకత నగర ప్రజలకు ఎంతైనా ఉందన్నారు. టీడీపీ శ్రేణులు క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటికి వెళ్లి చంద్ర బాబు ముఖ్యమంత్రి కావాల్సిన ఆవశ్యకతను, తెలుగుదేశం కూటమి అందించే సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలను ప్రతి ఓటరుకు వివరించాలని కోరారు. సమావేశంలో నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, నాయకులు గదుల సాయిబాబు, ఎంఎ తాజుద్దీన్, సీకోటి అప్పలకొండ, తుమ్మల రమేష్, వొమ్మి బాలాజీ, బంగారు సత్యనారాయణ, చొల్లంగి వీరబాబు, ఎండీ అన్సర్, అంబటి చిన్న, నల్లూరి శ్రీనివాస్, మల్లాడి గంగాధరం, చింతలపూడి రవి, గుజ్జు బాబు, ఎస్కే రహీమ్, గాది శివ, చోడిపిల్లి సతీష్, ఖాన్, మూగు రాజు, మీసాల సునీత, కొల్లు కుమారి, దేవు జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'కూటమి విజయానికి సహకరించాలి'

గురజనాపల్లి (కరప), మార్చి 20: వచ్చే ఎన్నికల్లో ప్రతీ ఒక్కరూ సమష్టి కృషితో కూటమి విజయానికి సహకరించాలని కాకినాడరూరల్ నియోజకవర్గ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి పంతం నానాజీ, టీడీపీ కో-ఆర్డినేటర్ పిల్లి సత్తిబాబు, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి విజ్ఞప్తి చేశారు. మండలంలో గురజనాపల్లి శివారు అడవిపూడిలో బుధవారం టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలిసి వారు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. వైసీపీ అరాచక పాలనను అంతమొందించడానికి ఇదే మంచి అవకాశమని ప్రజలు గుర్తించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో గాజు గ్లాసు గుర్తుకు ఓటేసి గెలిపించాలని విజ్ఞప్తిచేశారు. నానాజీ, పిల్లి సత్తిబాబు దంపతులను భారీ గజమాలతో సత్కరించారు. ప్రచారంలో ఇరు పార్టీల నాయకులు మామిడాల వెంకటేష్, కర్నాసుల పుష్పరాజు, పబ్బినీడి వెంకటకృష్ణ, గట్టి రవి, బుంగా సింహాద్రి, పెంటపాటి సత్తిబాబు, గుల్లిపల్లి శ్రీనివాసరావు, బోగిరెడ్డి కొండబాబు, బోగిరెడ్డి గంగాధర్, బండారు మురళి, యండమూరి వీరవేణి, పబ్బినీడి నాగేశ్వరరావు, పంపన కన్నారావు, మద్దూరి స్వామి, అడపా వీరభద్రరావు పాల్గొన్నారు. గురజనాపల్లి 1వ వార్డు సభ్యుడు కొప్పిశెట్టి మాధవి వీరభద్రరావు, కొప్పిశెట్టి వారి కుటుంబాలకు చెందిన పలువురు గ్రామంలో పంతం నానాజీ సమక్షంలో జనసేన పార్టీలో చేరగా సాదరంగా ఆహ్వానించారు.

జనసేనలో చేరికలు

సర్పవరం జంక్షన్, మార్చి 20: వలసపాకల గంగరాజునగర్ జనసేన పార్టీ కార్యాలయంలో బుధవారం రమణయ్యపేట పాత గైగోలుపాడుకు చెందిన టీడీపీ నాయకులు పిల్లి వినయ్ ఆధ్వర్యంలో సుమారు 100 మంది వైసీపీ కార్యకర్తలు వాసంశెట్టి శ్రీనివాస్, మేడిశెట్టి శ్రీనివాస్, గుత్తుల మణికంఠ, కోట వెంకటరమణ, వాసంశెట్టి వివేక్, సతీష్, గుబ్బల రమణ, సవరపు పండు తదితరులు పార్టీలో చేరగా కాకినాడ రూరల్ జనసేన-టీడీపీ ఉమ్మడి అభ్యర్థి పంతం నానాజీ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. పార్టీ నాయకులు పాలిక రమణ, పాలిక నాగరాజు, పాలిక రామ్మోహన్, వాసంశెట్టి మురళీ, పాలిక సత్యనారాయణ, భద్రరావు, గిరిజాల లక్ష్మీదేవి తదితరులున్నారు.

రౌతులపూడి: మండలంలో శృంగవరం వైసీపీకి చెందిన 100మంది కార్యకర్తలు ప్రత్తిపాడు జనసేన ఇన్‌చార్జ్ వరుపుల తమ్మయ్యబాబు ఆధర్యంలో పార్టీలో చేరారు. మేడిశెట్టి సూర్యకిరణ్, పెంటకోటమోహన్, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

'సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి చేయాలి'

కలెక్టరేట్ (కాకినాడ), మార్చి 20: ఓఎన్జీసీ ద్వారా మత్స్యకార గ్రామాల్లో సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి పనులను చేయాలని మత్స్యకార సంఘం ప్రతినిధులు కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ రామ్‌సుందర్‌రెడ్డిని కోరారు. బుధవారం మత్స్యకార ప్రతినిధులు వాసుపల్లి కృష్ణ, పాలపు నూకరాజు, సత్యనారాయణ, శ్రీను జేసీకి వినతిపత్రం ఇచ్చారు. ఉప్పాడ నుంచి ఉప్పలంక వరకు ఉన్న మత్స్యకార గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీ పనులను చేయాలని, మత్స్యకార కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఉచితంగా విద్యనందించాలని కోరారు. మత్స్యకారులకు ప్రత్యేకంగా కమ్యూనిటీ హాలు, ఇతర సౌకర్యాలను కల్పించాలన్నారు. ఓఎన్జీసీ, రిలయన్స్ ఇచ్చే నిధులతో మత్స్యకార గ్రామాలను అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నందున ఎన్నికలు ముగిసే సమయానికి నిధులు సిద్ధం చేయాలని వారు కోరారు.

'ఎన్నికల నియమావళిని అమలు చేయాలి'

సర్పవరం జంక్షన్, మార్చి 20: ఎన్నికల నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారి, కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్ ఆదేశించారు. బుధవారం రమణయ్యపేట మండల పరిషత్తు కార్యాలయంలో కాకినాడ రూరల్ నియోజకవర్గం బూత్ లెవెల్ ఆఫీసర్లు (బీఎల్వో), సూపర్‌వైజర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అన్ని పోలింగ్ స్టేషన్‌లలో పూర్తిస్థాయిలో మౌళిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. రాజకీయ పార్టీల ప్రచార ఫ్లెక్సీలు, బోర్డులు, బ్యానర్లు, కటౌట్లు, గోడ పత్రాలను తక్షణమే తొలగించాలని ఆదేశించారు. ఎవరైనా అనుమతి లేకుండా ఏ విధమైన ప్రచార ఫ్లెక్సీలు తదితరవి ఏర్పాట్లు చేస్తే కేసు నమోదు చేస్తామని తెలిపారు. సమావేశంలో కాకినాడ రూరల్, కరప తహశీల్దార్లు విజయ ప్రసాద్, వి. రామకోటేశ్వరరావు తదితర అధికారులు పాల్గొన్నారు.

వంతెనకు వైసీపీ రంగుల తొలగింపు

కరప, మార్చి 20: మండలంలో పాతర్లగడ్డ వద్ద కేఎమ్‌జేకెనాల్‌పై నిర్మించిన వంతెనకు వైసీపీ రంగులు పూయడాన్ని ప్రస్తావిస్తూ ఆంధ్రజ్యోతిలో బుధవారం వెలువడిన కథనానికి అధికారులు స్పందించారు. రిటర్నింగ్ అధికారి, కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్ ఆదేశాల మేరకు వంతెనకు తెల్లరంగు వేసి వైసీపీ రంగులను తొలగించారు. అలాగే మండలంలోని ఆయా గ్రామాల్లో శిలాఫలకాలకు కాగితాలు అంటించి సీఎం, స్థానిక ఎమ్మెల్యేల చిత్రాలు కనిపించకుండా చేశారు. సిద్ధం పోస్టర్లు, అధికారపార్టీ ఫ్లెక్సీలను తొలగించారు. కరప సచివాలయం-1 పేరుతో ఉన్న వాట్సాప్ గ్రూప్‌లో అధికార పార్టీకి అనుకూలంగా పెడుతున్న మెసేజ్‌లపై ఆర్వో కిషోర్ సీరియస్ అయ్యారు. గ్రూప్ అడ్మిన్‌పై కేసు నమోదు చేయాలని ఎంపీడీవో అప్పారావును ఆయన ఆదేశించారు.

ఎన్నికలకు సంబంధించి హెల్ప్‌లైన్ సెంటర్

కార్పొరేషన్ (కాకినాడ), మార్చి 20: మే 13న జరగనున్న ఎన్నికలకు సంబంధించి సమస్యలు, సందేహాలు, ఫిర్యాదుల పరిష్కారం కోసం హెల్ప్‌లైన్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్టు సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు తెలిపారు. హెల్ప్‌లైన్ సెంటర్ నిర్వాహణపై బుధవారం ఎన్నికల అధికారులకు పలు ఆదేశాలు ఇచ్చారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు 24గంటలూ పనిచేసే మూడు షిఫ్ట్‌ల్లో 12మంది ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. సీటీ నియోజకవర్గ పరిధిలో ఏమైనా ఫిర్యాదులు, సందేహాలు ఉన్నా హెల్ప్‌లైన్ 0884-2349400కు సమాచారం అందజేయాలన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు

కరప, మార్చి 20: వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు కరప ఏఎస్ఐ వి.సూరిబాబు తెలిపారు. మండలంలో గొడ్డటిపాలెం గ్రామానికి చెందిన యాళ్ల ఈశ్వరరావుకు కరపలో ఉంటున్న తన సోదరి చింతా విజయలక్ష్మి కుమార్తె దేవితో మూడేళ్ల క్రితం వివాహమై ఒక కుమార్తె ఉంది. వ్యవసాయ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న ఈశ్వరరావుకు భార్య దేవిల మధ్య గత కొన్నిరోజులుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఈనెల 7న ఉదయం కరపలో ఉంటున్న అమ్మ వద్దకు వెళ్లొస్తానని చెప్పిన దేవి తిరిగి ఇంటికి రాలేదు. ఆమె ఆచూకీ కోసం ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో దేవి తల్లి విజయలక్ష్మి బుధవారం కరప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ తెలిపారు.

బెండపూడి చెక్‌పోస్టు సేవలు నిలిపివేత

తొండంగి, మార్చి 20: రాష్ట్ర రవాణా శాఖ బెండపూడిలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు సేవలు నిలిచి పోయాయి. దేశవ్యాప్తంగా జీఎస్టీ అమలులోకి వచ్చిన నేపథ్యంలో చెక్ పోస్టులను రద్దు చేయాలంటూ కేంద్ర రవాణా శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాల మేరకు రవాణా శాఖ కమిషనర్ ఇచ్చిన ఆదేశాలతో బెండపూడిలో రవాణా శాఖ చెక్‌పోస్టు సేవలను నిలిపి వేసింది. దీంతో వివిధ వాహనాలు ఇక్కడ ఎటువంటి తనిఖీలు లేకుండా స్వేచ్ఛగా రాకపోకలు జరిపేందుకు అవకాశం ఏర్పడింది.

యనమలను కలిసిన బీజేపీ నాయకులు

తుని రూరల్, మార్చి 20: మాజీ మంత్రి యనమల రామకృష్ణుడును జిల్లా బీజేపీ అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్, పలువురు నాయకులు తేటగుంటలో కలిశారు. కూటమి బలోపేతం, క్షేత్రస్థాయి పర్యటనలు, పార్టీ గెలుపునకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. రాష్ట్ర ధార్మిక సంఘం కోఆర్డినేటర్ కామర్స్ చిరంజీవి, వెలుగుల కృష్ణారావు, ఆకెళ్ళ శాస్త్రి, పుల్లంరాజు, జిల్లాలకు చెందిన టీడీపీ నాయకులు ఉన్నారు.

వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ

కరప, మార్చి 20: వేళంగి మార్కెట్‌సెంటర్ సమీపంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం ఘనంగా జరిగింది. అనంతరం స్వామివారి కల్యాణం వేడుకగా నిర్వహించారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, శ్రీవిద్య దంపతులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.

ఈదురుగాలులతో భారీ వర్షం

జలమయమైన రోడ్లు
పలు చోట్ల విరిగిపడిన చెట్లు
ఇబ్బందులు పడిన ప్రజలు


పిఠాపురంలో కురిసిన వర్షంతో నిలిచిన నీరు


కరపలో కురుస్తున్న వర్షం

కాకినాడ సిటీ/కలెక్టరేట్ (కాకినాడ), మార్చి 20: కాకినాడ నగరంలో బుధవారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. దీంతో పాటు కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో వడగళ్ల వాన కురవడంతో ప్రజలు ఉలిక్కి పడ్డారు. ఈ వడగళ్ల వానలో కొందరు సేద తీరగా, చిన్నారులు ఐసు ముక్కలుగా పడిన వడగళ్లను చేతిలోకి తీసుకుంటూ కేరింతలు కొట్టారు. పెద్ద పెద్ద శబ్దాలతో వర్షం పడడంతో ఎక్కడికక్కడ జనజీవనం స్థంభించింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పలు చోట్ల చెట్లు విరిగిపడటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ప్రధానంగా రామారావుపేట, టూటౌన్, మెయిన్‌రోడ్డు, సినిమారోడ్డు, సూర్యనారాయణపురం, రెవెన్యూకాలనీ, సాంబమూర్తినగర్, బాలాజీచెరువులలో రోడ్లు జలమయ్యాయి. దీంతో వాహనదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నగరంలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం వల్ల చిన్న పాటి వర్షానికే రోడ్లు జలమయం అవుతున్నాయని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. పేరుకే స్మార్ట్ సిటీగానీ వర్షం వస్తే రోడ్లు చెరువుల్లా తలపిస్తున్నాయని వాపోతున్నారు.

కాకినాడ రూరల్: రూరల్ మండలం చీడిగ, ఇంద్రపాలెం, కొవ్వాడ, గంగనాపల్లి, రేపూరు, స్వామినగర్ తదితర గ్రామాల్లో బుధవారం సాయంత్రం ఈదురుగాలులు వడగండ్లతో కూడిన భారీవర్షం కురిసింది. దీంతో గ్రామాల్లోని ప్రధాన రహదారులన్నీ జలమయమయ్యాయి. ఉరుములు,మెరుపులు, పిడుగుల అలజడితో వర్షం ప్రారంభం కాగా సుమారు గంట పాటూ కురిసిన వడగండ్లతో కూడిన భారీ వర్షానికి ప్రజలు, వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

పిఠాపురం/గొల్లప్రోలు: పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాల్లో బుధవారం సాయంత్రం ఈదురుగాలులతో వర్షం కురిసింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో ఉదయం నుంచి వాతావరణం మేఘావృతమై సాయంత్రం దట్టంగా మబ్బులు అలముకుని భారీగా గాలులు వీచాయి. అనంతరం వర్షం కురిసింది. వర్షంతో పట్టణంలో రహదారులపై నీరు ప్రవహించింది. వాతావరణం చల్లబడంతో ప్రజలు సేదతీరారు. గాలులు, వర్ష ప్రభావంతో కోతకు సిద్ధమవుతున్న వరిపంటకు నష్టం చేకూరే ప్రభావం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కోటనందూరు: కోటనందూరు శివారులో బుధవారం సాయంత్రం పిడుగు పడి వరికుప్ప దగ్ధమైంది. కోటనందూరుకు చెందిన గొంపగజ్జయ్య తన 2 ఎకరాల పొలంలో వరికుప్పను అపరాలసాగు ఉండడంతో నూర్చకుండా అలావదిలివేశాడు. పిడుగు పడి అపిడుగులు వరికుప్ప పూర్తిగా కాలిపోయి నష్టం వాటిల్లింది. ఫైర్ సిబ్బంది వచ్చేటప్పటికే పూర్తిగా కాలిపోయింది. రెవెన్యూ అధికారులు పరిశీలించారు. మండలంలోని కోటనందూరు, జగన్నాధపురం, బొద్దవరం, కాకరాపల్లి గ్రామాల్లో భారీవర్షం కురిసింది.

సామర్లకోట: పట్టణంలో బుధవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీవర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. జయలక్ష్మీటాకీసు రోడ్డు, ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డు, వెల ంపేట, సాయినగర్ తదితర ప్రాంతాల్లో రోడ్లపై మురుగునీరు పెద్దఎత్తున నిలిచింది. ఈదురుగాలు ల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

ప్రత్తిపాడు: ప్రత్తిపాడులో బుధవారం సాయంత్రం ఆకాశం మేఘావృతమై ఉరుములు,మెరుపులు ఈదురుగాలులతో వర్షం పడింది. దాళ్వా వరి రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికే కోత దశకు చేరుకున్న వరి చేలు నేలవారడంతో రైతులు దిగుబడులు తగ్గడం, గింజ రాలి మొక్కల మొలకెత్తడం వంటి నష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆందోళనకు గురవుతున్నారు. కొన్నిగ్రామాల్లో కోతలు కోసిన దాళ్వావ వరి కూడా తడిసి ముద్దయింది. ఇది ఇలా ఉంటే ఈ అకాల వర్షం మామిడితోటలకు మేలు చే కూరుతుందని మామిడి రైతులు తెలిపారు. కొన్ని చోట్ల ఈదురుగాలులకు పూత రాలడం జరిగిందని చెప్పారు.

కరప: మండల వ్యాప్తంగా బుధవారం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. కొన్నిచోట్ల వడగళ్ల వాన పడడంతో చిన్నారులు వాటిని ఏరుకోవడానికి ఆసక్తి కనబరిచారు. ఈదురు గాలులకు మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరిగాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పలు చోట్ల ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడ్డాయి. భారీగా కురిసిన వర్షానికి డ్రైన్‌లు పొంగిపొర్లాయి. ప్రధాన రహదారులు, వీధుల్లో వర్షం నీరు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

రౌతులపూడి: మండలంలోని పలు గ్రామాల్లో భారీవర్షం పడింది. అపరాల పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. అలాగే జీడిమామిడి పంటల నష్టం ఎక్కువగా ఉంటుందని రైతులు వాపోతున్నారు.

గండేపల్లి: మండలవ్యాప్తంగా బుధవారం సాయంత్రం ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో కూడిన భారీవర్షం సుమారు గంటపాటు ఎడతెరిపి లేకుండా కురిసింది. వరి, మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లుతుందని రైతులు అంటున్నారు.

కిర్లంపూడి: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం భారీ వర్షం కురిసింది. దీంతో వాహనదారులు ఇక్కట్లు పడ్డారు. రోడ్లన్నీ జలమయమయ్యాయి.


కోటనందూరు శివారులో పిడుగుపాటుకు దగ్ధమైన వరి కుప్ప


సామర్లకోటలో నీట ముంపులో రోడ్డు

టీడీపీ, జనసేన కూటమితో వైసీపీలో వణుకు

ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప
వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు


పెద్దాపురం: కండువా కప్పుతున్న చినరాజప్ప


తునిరూరల్: టీడీపీలోకి ఆహ్వానిస్తున్న యనమల

పెద్దాపురం, మార్చి 20: టీడీపీ, జనసేన కూటమితో వైసీపీలో వణుకు ప్రారంభమైందని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. స్థానిక సుధా కాలనీలో ఉన్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద చినరాజప్ప సమక్షంలో పలువురు టీడీపీలో చేరారు. కట్టమూరు గ్రామానికి చెందిన విశ్రాంత హౌసింగ్ ఏఈ సానిపిన రామకృష్ణ తన అనుచరులు సుమారు 250 మందితో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. అలాగే పెద్దాపురం 20వ వార్డుకు చెందిన సుమారు 50 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరగా వారందరికీ రాజప్ప పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు రాజాసూరి బాబురాజు, కొత్తిం వెంకట శ్రీనివాసరావు, ఎలిశెట్టి నాని, మేడిది శ్రీనివాస్, ఏలేటి సుబ్బారావు, అడపా గంగాధర్, నంది ఉమామహేశ్వరి ఉన్నారు.

సామర్లకోట: రానున్న ఎన్నికల్లో వైసీపీ అరాచక పాలనకు చెక్‌పెట్టేందుకు చంద్రబాబు పాలనకు మద్దతు పలకాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. సామర్లకోటలోని 28,29 వార్డుల్లో ఆయన ఇంటింటా ప్రచారాన్ని బుధవారం రాత్రి నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు రంగనాగ్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

జగ్గంపేటలో టీడీపీలో చేరికలు


నవీన్‌ను బొకే అందజేస్తున్న సత్తి సదాశివరెడ్డి

జగ్గంపేట, మార్చి 20: స్థానిక టీడీపీ కార్యాలయంలో జగ్గంపేట గ్రామ పంచాయతీ 14వ వార్డు సభ్యుడు, ప్రముఖ ఇంజనీర్, వైసీపీ నేత సత్తి సదాశివరెడ్డి, పద్మనాభ నగర్ వైసీపీ యువ నేత దంట శివ ఆధ్వర్యంలో వందమంది వైసీపీకి రాజీనామా చేసి జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ సమక్షంలో టీడీపీలో చేరగా ఆయన పార్టీ కండువాలు వేసి సాదరంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, కొత్త కొండబాబు, పాండ్రంగి రాంబాబు, జీను రాంబాబు, కింగం రమణ, రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల కార్యదర్శి సారుగుడి నాగన్న, నండ్ల చిరంజీవి, కోరాడ బాబురావు, కోరాడ సత్తిబాబు, చెలికాని హరిగోపాల్, అల్లు అంజిబాబు, వాకారెడ్డి పాల్గొన్నారు. వైసీపీ నేత, ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ముఖ్యఅనుచరుడు రామవరం గ్రామానికి చెందిన బోధ శివకుమార్‌తోపాటు ఎనిమిదో వార్డు మెంబరు కాపవరపు గంగాధర్ టీడీపీలో చేరగా జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ పార్టీలోకి ఆహ్వానించారు. మల్లిసాలకు చెందిన వైసీపీ నేతలు టీడీపీలో చేరారు. చత్రాతి జగ్గారావు, బం డారు పాండవులు, మట్టే సింగర పద్మరాజు, నక్క రాజు సూరి బాబు, కర్రి సత్తిబాబు, దిమ్మల పండు 20 కుటుంబాలు నవీన్ సమక్షంలో పార్టీ కండువా వేసుకున్నారు.

తేటగుంటలో...

తుని రూరల్, మార్చి 20: తుని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కుసుమంచి శోభారాణి, సత్యనారాయణ దంపతులు అనుచరగణంతో టీడీపీలోకి చేరారు. తేటగుంటలో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు, తుని టీడీపీ అభ్యర్థి యనమల దివ్య పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ కుసుకుంచి సత్యనారాయణ దంపతులు అనుచరులతో పార్టీలోకి రావడం శుభ పరిణామమని, పార్టీ మరింత బలం పుంజుకుంటుందన్నారు. కార్యక్రమంలో దంతులూరి శ్రీనివాసరాజు, సుర్ల లోవరాజు,మోతుకూరి వెంకటేష్, చింతమనీడి నాగ సోమరాజు(అబ్బాయి),నార్ల రత్నాజీ, కుక్కడపు బాలాజీ, యినుగంటి సత్యనారాయణ, చోడిశెట్టి వెంకటేష్, పలువురు పట్టణ టీడీపీ నాయకులు ఉన్నారు.

ఏలేశ్వరంలో...

ఏలేశ్వరం, మార్చి 20: పట్టణంలో 17వ వార్డులో టీడీపీ నాయకులు ఆధ్వర్యంలో వైసీసీకి చెందిన 100మంది మహిళలు, యువకులు షేక్‌నూరి, షేక్ ఇమ్రాన్‌ఖాన్, షేక్ అమ్ములు, షేక్ అమర్, నీలం మణికంఠ, భవాని, మదీనా, శ్యామ్, నీలం శివసాయి, పలువురికి ప్రత్తిపాడు టీడీపీ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, ఎమ్. నాగబాబు, కె. వెంకటరమణ, పెంద్ర శ్రీను, టీడీపీ నాయకులు వైభోగుల సుబ్బారావు, జిగటాపు సూరిబాబు, కొప్పుల బాబ్జి, బుగతా శ్రీను, బూర్లు సత్తిబాబు ఉన్నారు.

అన్నవరం: గ్రామానికి చెందిన 100 మంది శెట్టిబలిజ పేటకు చెందిన వైసీపీ కార్యకర్తలు సంఘం నాయకుడు గండిమేను ఆదినారాయణ అధ్యక్షతన ప్రత్తిపాడు టీడీపీ ఇన్‌చార్జ్ వరుపుల సత్యప్రభ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో మీసాల రాజు, మురళిరాజు, బద్దిరామారావు, పర్వత సురేష్, వెన్నాశివ, పైల సాంబశివ తదితరులున్నారు.

శంఖవరం: మండలంలో గౌరంపేటకు చెందిన వైసీపీ కార్యకర్తలు ప్రత్తిపాడు టీడీపీ ఇన్‌చార్జ్‌వరుపుల సత్యప్రభ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. నాయకులు గుండ్రాజు సత్యనారాయణ, ప్రగడ మహేష్, మురళీకృష్ణరాజు, సూర్యనారాయణరాజు పాల్గొన్నారు.

కాకినాడలో...

కాకినాడ సిటీ, మార్చి 20: 28వ డివిజన్‌కు చెందిన పెద్ద సంఖ్యలో యువకులు కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు నివాసం వద్ద టీడీపీలో చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో గదుల సాయిబాబు, రెడ్నం సత్తిబాబు, పిల్లి ఆదిత్య, నెల్లి మురళీమోహనకృష్ణ, రెడ్నం దుర్గాప్రసాద్, మండపాక సాయిరాం, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురంలో...

పిఠాపురం, మార్చి 20: మాజీ ఎమ్మెల్యే వర్మ ఆధ్వర్యంలో పిఠాపురం మండలం బి.ప్రత్తిపాడు గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు బొజ్జా అప్పయ్య లచ్చ, మధు, మాదాసు వీరబాబు, ఆకుల గంగ రాజు, బొజ్జా చిట్టిబాబు, వీరబాబు, నల్లా అప్పారావు తదితరులు టీడీపీలో చేఆరు. కొత్తపల్లి మండలం గోర్స సర్పంచ్ రొంగల వీరబాబు సహా పలువురు టీడీపీ మండలాధ్యక్షుడు అనిశెట్టి సత్యానందరెడ్డి, మాజీ ఎంపీటీసీ సన్నిబాబు ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. అనంతరం ఎఫ్‌కేపాలెం గ్రామంలో టీడీపీ, జనసేన ఆత్మీయ సమావేశం నిర్వహించారు.

వైభవంగా వేంకటేశ్వరుని కల్యాణం

పోర్టు సిటీ (కాకినాడ), మార్చి 20: అలివేలు మంగా పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. స్థానిక మెహర్‌నగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం రాత్రి నిర్వహించిన 50వ వార్షికోత్సవ కల్యాణ మహోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తొలుత ధ్వజారోహణం, హోమంతో పాటు భక్తి సంగీత విభావరి నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు పున్నమరాజు శ్రీనివాసాచార్యులు, ధర్మకర్త మల్లిపూడి రామచంద్రమూర్తి సతీమణి అమ్మాణి, ఆలయ మాజీ ప్రథమ అధ్యక్షుడు ముమ్మిడి రామచంద్రరావు సతీమణి బుల్లెమ్మలను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు మల్లిపూడి వెంకటేష్, మల్లిపూడి చత్రపతి శివాజీ గణేష్, ఆలయ అధ్యక్ష కార్యదర్శిలు ముమ్మిడి వెంకటేశ్వరరావు, జట్ల నాగేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.

శ్రీ మహావిష్ణువు కల్యాణోత్సవం

తుని రూరల్, మార్చి 20: ప్రసిద్ధి క్షేత్రం తిమ్మాపురం శ్రీ మహావిష్ణువు సమేత మహాలక్ష్మి అమ్మవారి దివ్య కల్యాణ మహోత్సవం బుధవారం రాత్రి కన్నుల పండుగగా జరిగింది. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి తరించారు. ఆలయ ధర్మకర్తలు పోల్నాటి శేషగిరి దంపతులు స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించగా వేద పండితులు కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నదానంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

'పేట'లో లక్కీ షాపింగ్ మాల్ ప్రారంభం


కొత్త డిజైన్ పట్టుచీరను ప్రదర్శిస్తున్న అనసూయ

తునిరూరల్, మార్చి 20: పాయకరావుపేటలో బుధవారం లక్కీ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. చిత్రమందిర్ థియేటర్ ఎదుట ఏర్పాటుచేసిన ఈ షాపింగ్‌మాల్‌ను ప్రముఖ యాంకర్, సినీ నటి అనసూయ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కస్టమర్ల అభిరుచులకు అనుగుణంగా కొత్త డిజైన్లు, నాణ్యత, అందరికీ అందుబాటులో ఉండే ధరలకు అన్ని రకాల వస్త్రాలను అందజేస్తున్న లక్కీ షాపింగ్ మాల్‌ను పాయకరావుపేట, తుని పరిసర ప్రాంతాల ప్రజలు సందర్శించాలన్నారు. అనంతరం ఆమె షాపింగ్ మాల్‌లో ఉన్న కొత్త డిజైన్ల పట్టు చీరలను ప్రదర్శించారు. అలాగే అనకాపల్లి ఎంపీ కె.సత్యవతి, తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్, జిల్లా వ్యవసాయ అభివృద్ధి సలహా మండలి చైర్మన్, వైసీపీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు, తుని నియోజకవర్గ టీడీపీ నేత యనమల కృష్ణుడు తదితరులు జ్యోతి ప్రజ్వలనచేసి షాపింగ్ మాల్‌లోని వివిధ విభాగాలను ప్రారంభించారు. షాపింగ్ మాల్ ప్రతినిధులు జి.శ్రీనివాసరావు, ఎస్.రత్తయ్య, కట్టా నూకరాజు, గిరిధర్, రాజేశ్ పాల్గొన్నారు. లక్కీ షాపింగ్ మాల్‌ను ప్రారంభించేందుకు వచ్చిన సినీ నటి అనసూయను చూసేందుకు ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావడంతో స్థానిక చిత్రమందిర్ సెంటర్ కిక్కిరిసింది. షాపింగ్ మాల్ ఎదుట నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

సాయుధ బలగాల కవాతు

తుని రూరల్, మార్చి 20: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు తుని మండల గ్రామాల్లో సీఐ ఎస్.మూర్తి, ఎస్ఐ బి.రమేష్‌బాబుతో కలిసి సాయుధ బలగాలు కవాతు నిర్వహించారు. అవగాహన సదస్సు చేపట్టారు.

తాళ్లూరులో వైభవంగా తిరునాళ్లు


వేంకటేశ్వరస్వామి దర్శనానికి క్యూ కట్టిన భక్తులు

గండేపల్లి, మార్చి 20: మండలం తాళ్లూరులో కోరిన కోర్కెలు తీర్చే శతాబ్దాల చరిత్ర కలిగిన జీఎన్ మఠంలో వెలసిన వేంకటేశ్వరస్వామి తిరునాళ్లు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చి గజేంద్ర పుష్కరిణిలో స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. గ్రామానికి చెందిన బైపిన సోమరాజు తులసి దంపతులు ఆధ్వర్యంలో మజ్జిగ, పాలు, మంచినీరు పంపిణీ చేశారు. ఎక్కడ అవాంఛనీయ సంఘటనలు జగరకుండా సీఐ ఎస్.లక్ష్మణరావు, గండేపల్లి ఎస్ఐ ఎస్.రామకృష్ణ ఆధ్వర్యంలో జగ్గంపేట, కిర్లంపూడి ఎస్ఐలు నాగార్జున, జబ్బీర్‌లు బందోబస్తు నిర్వహించారు. భక్తులకు ఒబిన్ వెంకట్రావు, చెల్లూరు రాంబాబు, దాపర్తి సీతారామయ్య, అరె శ్రీనివాస్, కొండ్రు అప్పలరాజు ఆధ్వర్యంలో గ్రామపెద్దల సహకారంతో అన్నదానం నిర్వహించారు. ఈవో రాజేష్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. స్వామివారిని టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ దర్శించుకున్నారు. రాష్ట్ర కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు, పైణ్ణి వెంకటేశ్వరరావు, సర్పంచ్ ఒబిన్ వీరబాబు ఉన్నారు.

సమాజానికి ఉపయోగపడాలి : ఎస్పీ


కాకినాడలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ

ఏలేశ్వరం, మార్చి 20: స్పార్క్ ఫౌండేషన్ అంతరిక్ష విద్య భగస్వాములుగా ఎంపికై రాష్ట్రానికి మంచి పేరుతెచ్చారని యువతను ఎస్పీ సతీష్ కుమార్ కొనియాడారు. యువత సమాజానికి ఉపయోగపడేలా ఇటువంటి ఆధునిక, సాంకేతిక దశల్లో ముందుకు కెళ్లాలని సూచించారు. రాష్ట్రం నుంచి మెట్టమెదటి శాస్త్రీయ సాంకేతిక అంతరిక్ష సంస్థగా ఎంపికై సాంకేతిక విద్య కోసం కృషి చేస్తూ ఇప్పటికే రికార్డులు సాధించి, అంతరిక్షవిద్యలో భారతదేశాన్ని ఆధునికత దశలో తీసుకెళ్లడానికి కృషి చేస్తున్నామని సందీప్ అన్నారు. ఏలేశ్వరానికి చెందిన స్పార్క్ ఫౌండేషన్ యువతకు బుధవారం కాకినాడలో ఎస్పీ శాలువాలు కప్పి ప్రసంసాపత్రాలు అందజేశారు. అనంతరం సైబర్ ప్రో లాక్ పోస్టర్ ఆవిష్కరించారు.

85 లక్షల మొక్కలు నాటాలి : పీడీ


ప్రత్తిపాడులో రికార్డులు పరిశీలిస్తున్న డ్వామా పీడీ

ప్రత్తిపాడు, మార్చి 20: జిల్లాలో ఉపాధి హామీ పథకంలో భాగంగా ఈ ఏడాది 85లక్షల మొక్కలు నాటేందుకు నిర్ణయించినట్టు డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి తెలిపారు. ప్రత్తిపాడులోని ఉపాధి హామీ పథకం కార్యాలయాన్ని బుధవారం ఆమె సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ గతేడాది 75లక్షల వరకు మొక్కలు నాటే లక్ష్యాలను నిర్ణయించగా 66లక్షల వరకు నాటారని చెప్పారు. ప్రస్తుతం ఎండల తీవ్రత పెరగడంతో జిల్లాలో పని చేస్తున్న ఉపాధి కూలీలకు పని చేసే చోట నీడ కల్పించే చర్యలు చేపడుతున్నామన్నారు. టెంట్లు, చలువ పందిళ్ళు ఏర్పాటుతో పాటు మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతున్నామన్నారు. ఏపీవో పీపీ కుమార్‌స్వామి ఉన్నారు.

పదో తరగతి పరీక్షలు

సామర్లకోట, మార్చి 20: సామర్లకోట పట్టణం, మండలంలోనూ పదోతరగతి పరీక్షల్లో భాగంగా బుధవారం 9 కేంద్రాల్లో హిందీ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని సామర్లకోట ఎంఈవో వై.శివరామకృష్ణయ్య తెలిపారు. మొత్తం 1,622 మంది విద్యార్థులకు గాను 1,585 మంది హాజరయ్యారన్నారు. పరీక్షా కేంద్రాలను, సామర్లకోట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ ఆర్జేడీ నాగమణి బృందం తనిఖీలు చేసింది.

గండేపల్లి: పదో తరగతి పరీక్షల్లో భాగంగా బుధవారం గండేపల్లి, తాళ్ళూరు, మల్లేపల్లి 3 సెంటర్లలో 501మందికి 489 మంది హాజరయ్యారని ఎంఈవో నాయక్ తెలిపారు.

విగ్రహ ప్రతిష్ఠ విరాళం

అన్నవరం, మార్చి 20: అన్నవరంలో సత్యదేవుడి దేవస్థానం బైపాస్‌రోడ్డు మార్గము నందు నూతనముగా నిర్మించిన స్వామివారి ప్రతి రూప ఆలయం నందు స్వామి అమ్మవార్లు గ్రానైట్ విగ్రహాలను ప్రతిష్ఠించుటకు, సుమారు రూ.లక్షతో తయారు చేయుటకు కాకినాడ జేఎన్టీయూకే ప్రొఫెసర్ లింగంగుంట సుమలత, నిడిగట్ల ఉదయ్‌శంకర్ ఈయన ఈవోకు డీడీ రూపంలో విరాళం అందజేశారు. అన్నవరంలో నిత్యాన్నదాన పథకానికి కట్టసాల వెంకటరమణ,విజయలక్ష్మీ దంపతులు రూ.101115 విరాళ అందించారు.

వాటర్ కూలింగ్ మిషన్ల బహూకరణ

పెద్దాపురం, మార్చి 20: మండలంలోని కాండ్రకోట నూకాలమ్మ దేవస్థానంలో త్వరలో అమ్మవారి జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం గుణ్ణం చంద్రమౌళి చారిటబుల్ ట్రస్ట్ అధినేత గుణ్ణం చంద్రమౌళి 2 వాటర్ కూలింగ్ మిషన్లను బహూకరించారు. దాతకు ఈవో కృతజ్ఞతలు తెలియజేశారు.